# బీఆర్‌ఎస్‌లో కాంగ్రెస్ నేతల చేరిక

- సంక్షేమ పథకాల ప్రతిఫలమే బీఆర్‌ఎస్‌కు బలం
- అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్



బీఆర్ఎస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

వట్‌పల్లి, అక్టోబర్ 25 : సంక్షేమ పథకాల ప్రతిఫలమే బీఆర్ఎస్ పార్టీకి బలంగా మారి పార్టీలోకి వలసలుగా చేరుతున్నారని ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. బుధవారం పోతులబోగుడలో ఎమ్మెల్యే, నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి ఫారూఖ్ హుస్సేన్, మాజీ డీసీసీ చైర్మన్ జైపాల్ రెడ్డి, సమక్షంలో రాయికోడ్ మండలంలోని మైబాత్‌పూర్, ఇస్సూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చే గ్యారెంటీలను నమ్మే పరిస్థిల్లో ప్రజలు లేరని అన్నారు. మారుమూల గ్రామం సైతం బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సునీతారెడ్డికి సత్కారం ..



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్, మాజీ మంత్రి సునీతారెడ్డిని సీఎం కేసీఆర్ ప్రకటించి బీఫామ్ అందించిన నేపథ్యంలో జిన్నారం మండల బీఆర్ఎస్ నాయకులు ఆమెను బుధవారం నర్సాపూర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, భోజిరెడ్డి, సింహారెడ్డి, మంద రమేశ్, రాఘవేందర్‌రెడ్డి, బాలరాజ్, ఎర్రవల్లి ప్రేమ్ తదితరులు ఆమెను గజమాలతో సన్మానించారు.

-జిన్నారం, అక్టోబర్ 25

## గెలుపునకు యువత కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న యూత్ అధ్యక్షుడు హర్షద్

పుల్కల్, అక్టోబర్ 25 : అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ గెలుపునకు యువత కృషి చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు హర్షద్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని మంతూర్‌లో బీఆర్ఎస్ యూత్ సభ్యులు నిర్వహించిన సమావేశానికి హర్షద్ హాజరై మాట్లాడారు. ఓటు విలువ తెలిసేలా, ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం ప్రజలకు అందజేసింది అనేది ప్రజలకు క్లుప్తంగా వివరించాలన్నారు.

## బావిలో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

న్యాల్‌కల్, అక్టోబర్ 25 : గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైన సంఘటన బుధవారం మండలంలోని గంగ్వార్ గ్రామంలో చోటుచేసుకున్నది. హద్నూర్ ఎస్సై రామానాయుడు కథనం ప్రకారం.. స్థానిక గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో గుర్తు తెలియని (33) వ్యక్తి శవం కనిపించడంతో గ్రామస్తులు సమాచారం మేరకు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవఖానకు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

**కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నాగల్‌గిద్ద, అక్టోబర్ 25 : సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలను వివరించి బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో నాగల్‌గిద్ద మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేసిందన్నారు. అనంతరం ముక్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శంకర్ పటేల్ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వల్లూర్ గ్రామానికి చెందిన మేత్రి గోపాల్ నామినేషన్ ఖర్చులకు రూ. 10 వేల నగదును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమలో జడ్పీటీసీ రాజు రాథోడ్, మండల వైస్ ఎంపీపీ పండరి యాదవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మేత్రి పండరి, నాయకులు, ప్రహ్లాద్, అంజిరెడ్డి, నాగ్‌శెట్టి, బస్వరాజ్, కృష్ణ ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## తుల్జాపూర్‌కు బీఆర్‌ఎస్వీ నేతల పాదయాత్ర



తుల్జాపూర్‌కు పాదయాత్రతో తరలివెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

న్యాల్‌కల్, అక్టోబర్ 25 : రానున్న శాసన సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అఖండ మెజార్టీతో విజయం సాధించి.., మూడోసారి సీఎంగా కేసీఆర్, జహీరాబాద్ ఎమ్మెల్యేగా కొనింటి మాణిక్‌రావు రావాలని ఆకాంక్షిస్తూ న్యాల్‌కల్ మండలం మల్గి గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు మహారాష్ట్రలోని తుల్జాపూర్‌కు పాదయాత్రగా తరలివెళ్లారు. బుధవారం స్థానిక గ్రామానికి చెందిన బీఆర్ఎస్వీ నాయకులు పండిత్, మహేశ్, ప్రకాశ్, శ్రీకాంత్, నగేశ్, కార్తీక్, సందీప్, సాయి, రాకేశ్, గణేశ్, సునీల్, నర్సప్ప కలిసి దాదాపు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకునేందుకు పాదయాత్రతో తరలివెళ్లారు. ఈ పాదయాత్రను సర్పంచ్ మారుతీ యాదవ్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సిద్దారెడ్డి జెండాను ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ శివనంద శ్రీపతి, నాయకులు అర్జున్, భీమన్న, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి శుభాకాంక్షల వెల్లువ



దసరా పండుగ సందర్భంగా మంత్రి తన్నీరు హరీశ్‌రావును మునిపల్లి జడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ బుధవారం మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు, పీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పైతర సాయి కుమార్, మాజీ ఎంపీపీ చంద్రయ్య, రాయికోడ్ మర్కెట్ కమీటీ వైస్ చైర్మన్ అల్లపూరం నారాయణ, నాయకుడు చంద్రయ్య తదితరులు ఉన్నారు.

-మునిపల్లి, అక్టోబర్ 25





దసరా పండుగను పురస్కరించుకొని మంత్రి తన్నీరు హరీశ్‌రావుని హైదరాబాద్‌లో ఆర్సీపురం డివిజన్ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ దంపతులు కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

-రామచంద్రాపురం/అమీన్‌పూర్,అక్టోబర్25

## దళితుల ఆశ్వీరాద సభను విజయవంతం చేయాలి



అందోల్ : మాట్లాడుతున్న ఎంపీపీ బాలయ్య

అందోల్, అక్టోబర్ 25 : ఈ నెల 29న జోగిపేటలో నిర్వహించనున్న దళిత ఆశీర్వాదసభను విజయవంతం చేయాలని ఎంపీపీ జోగు బాలయ్య అన్నారు. బుధవారం అందోల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆశీర్వాద సభ విజయవంతంపై సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా క్రాంతికిరణ్ రెండో సారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అందులో భాగంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ నెల 29న సభను ఏర్పాటు చేశామని, కార్యక్రమానికి నియోజకవర్గంలోని దళితులు, దళిత సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ శంకరయ్య, మొగులయ్య, దేవయ్య, శ్రీశైలం, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవో నూతన కమిటీకి సన్మానం



జిల్లా టీఎన్జీవోస్ నూతన కమిటీని సన్మానించిన రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు జగదీశ్వర్

సంగారెడ్డి, అక్టోబర్ 25 : జిల్లా టీఎన్జీవోస్ నూతన కమిటీ ఎన్నిక కావడంతో రాష్ట్ర టీఎన్జీవో అధ్యక్షుడు మారం జగదీశ్వర్ కమిటీని సన్మానించారు. బుధవారం జిల్లా కమిటీ బృందం సభ్యులు హైదరాబాద్‌కు తరలివెళ్లి టీఎన్జీవోస్ భవన్‌లో కేంద్ర కమిటీ అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేయడంతో రాష్ట్ర భాద్యులు అభినందించారు. నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు.